క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్పీని కలిసిన నూతన సీఐలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్

ఆసిఫాబాద్‌అర్బన్: కొత్తగా ఆసిఫాబాద్, రెబ్బెన సీఐలుగా బాధ్యతలు స్వీకరించిన బాలాజీ వరప్రసాద్, సంజయ్‌లు సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నిరోధం, నిషేధిత పదార్థాల రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసిఫాబాద్ సీఐగా వరప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణ సీఐగా బాలాజీ వరప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సీఐగా విధులు నిర్వహించిన బుద్దె రవీందర్ ఇటీవల హైదరాబాద్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో వరప్రసాద్ ఆసిఫాబాద్‌కు బదిలీపై వచ్చారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై పటిష్టమైన నిఘా ఉంచుతామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

రెబ్బెన సీఐగా సంజయ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ సంజయ్

రెబ్బెన: రెబ్బెన నూతన సీఐగా సంజయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన బుద్దె స్వామిని బదిలీ చేయగా రామగుండం కమిషనరేట్‌లో వీఆర్‌గా ఉన్న సంజయ్ ఇక్కడికి వచ్చారు. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయ సిబ్బంది సీఐకి స్వాగతం పలికారు.

సీఐకి సన్మానం

కౌటాల: కౌటాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు సీఐగా బాధ్యతలు స్వీకరించిన సంతోష్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరు సహకరించాలని తెలిపారు. మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, మండల కన్వీనర్ బండు, ఆత్మరాం, జనార్దన్, శంకర్, సాయి, మాంగేశ్ పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం ప్రవేశ పెట్టాలి

కాగజ్‌నగర్‌రూరల్: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కోర్టు తీర్పు అమలుపరిచి పాత పింఛన్ విధానాన్ని అమలు పర్చాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఈజ్‌గాం పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లోని బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్‌గౌస్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: షీ టీం సేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని షీటీం సభ్యులు విద్యార్థులకు సూచించారు. సోమవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు సుభాష్ రాథోడ్, అధ్యాపక బృందం, సిబ్బంది, షీటీం సభ్యులు స్వప్న, రజనీ, దినేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు



కుక్కల దాడిలో గాయపడిన మహిళ (ఫైల్)



కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియాలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

- గుంపులుగా సంచరిస్తూ దాడులు
- భయాందోళనలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద తీవ్రమైంది. మనుషులపై దాడి చేసి గాయపర్చడంతో పాటు పశువులు, మేకలు, కోళ్లపై దాడి చేసి చంపుతున్నాయి. పట్టణంలోని రైల్వేస్టేషన్, కాపువాడ, సంజీవయ్య కాలనీ, ద్వారకానగర్, పెట్రోల్‌పంప్ ఏరియా, గాంధీనగర్‌తోపాటు మండలంలోని అందవెల్లి, భట్టుపల్లి, రాస్పెల్లి, ఆరెగూడ, తదితర గ్రామాలు కుక్కలకు ఆవాసాలుగా మారాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదాచారుల వెంట పడి మరీ కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఇటీవల కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని కాపువాడకు చెందిన కర్ల కళావతి అనే మహిళపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. అలాగే నిజాముద్దీన్‌కాలనీ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న ఓ ప్రయాణికుడిపై కూడా దాడి చేశాయి. ద్వారకానగర్ కాలనీలోని పెంపుడు కోళ్లు, పశువులపై దాడి చేసినట్లు కాలనీవాసులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో కుక్కల జనన నియంత్రణ కేంద్రాల ఏర్పాటుకు 2022, జూన్ 7న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆయా కేంద్రాల నిర్మాణానికి మూడు నెలల గడువు ఇచ్చింది. మూడు సంవత్సరాలు గడిచినా మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కేంద్రాన్ని నిర్మించినా నియంత్రణ శస్త్రచికిత్సలు జరగడం లేదు.

స్థావరాలుగా చికెన్ సెంటర్లు

పట్టణంలోని చికెన్, మటన్, చేపల మార్కెట్ ప్రాంతాలు కుక్కలకు ప్రధాన స్థావరాలుగా మారుతున్నాయి. మాంసానికి అలవాటు పడ్డ కుక్కలు మార్కెట్‌లో దొరక్కపోతే మేకలు, కోళ్లు, పశువులు, మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయి. అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమని స్థానికులు వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కల నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో కుక్కల సంఖ్య నానాటికీ పెరిగి పోతోంది. కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

కాగజ్‌నగర్ మున్సి పాలిటీ పరిధిలోని ఏబీసీ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభి స్తాం. ఆపరేషన్ థి యేటర్ పూర్తి కావాల్సి ఉంది. పశువైద్యాధి కారులు శస్త్రచికిత్సలకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. త్వరలోనే ప్రారంభించి కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, కమిషనర్, కాగజ్‌నగర్

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా..!



కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ముత్తంపేట వద్ద గుంతల్లో నిలిచిన నీరు



టోంకిని వద్ద భారీ గుంత

కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిర్పూర్ నియోజకవర్గ ప్రధాన రహదారిపై పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల మండలం ముత్తంపేట సమీపంలో, సిర్పూర్(టి) మండలం టోంకిని సమీపంలో భారీ గుంతలు ఏర్పడడంతో గుంతల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిలిచి ఉంటుంది. సిర్పూర్ (టి) డౌనల్ ప్రాంతంలో తారు రోడ్డు కాస్త బురద రోడ్డుగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై గల గుంతలు పూడ్చి వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- కౌటాల



సిర్పూర్ సమీపంలో..



సిర్పూర్ డౌనల్‌లో..

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



తిర్యాణి: గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో మోస్తరు వర్షానికే ఇళ్లలోకి నీళ్లు చేరాయి. మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలోని ఓంటిమామిడి గ్రామంలో సోమవారం కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. గ్రామంలోని డ్రెయినేజీలో చెత్త చెదారం నిండి ఉండటంతో వరద నీరు ఇళ్లలోకి వస్తున్నట్లు గ్రామస్తులు వాపోయారు. డ్రెయినేజీ శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానం



ఆహ్వానపత్రం అందజేస్తున్న సభ్యులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి హాజరు కావాలని తహసీల్దార్ భూమేశ్వర్, డీటీ సంతోష్‌కుమార్‌లకు కుమురం భీం ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఆహ్వానపత్రం అందజేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, ఆయా పోరు గ్రామాల పెద్దలు మాట్లాడుతూ ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఆత్రం లక్ష్మణ్, కుమురం కిరణ్, ఆత్రం ధర్మూ, ఆనంద్‌రావు, భీంరావు, లలిత, ప్రమీల తదితరులు ఉన్నారు.

రాజీవ్ యువ వికాసం అమలు చేయాలి



మాట్లాడుతున్న కూటికల ఆనంద్‌రావు

కెరమెరి: పేదలకు రుణాలిచ్చి ఆదుకోవాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం మరిచిపోయిందని సీపీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు చేసిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, మహిళలకు ప్రతీనెల రూ.2500 ఇవ్వడం లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంతో పాటు ఒక తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన హామీలను నెరవేర్చకుంటే సీపీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

పంటలో చీడ పురుగులు నివారించాలి



పంటను పరిశీలిస్తున్న వెంకట్

కెరమెరి: పంటలను కాపాడాలంటే చీడ పురుగులను నివారించాలని ఏడీఏ వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని సీంగూడలో గల రైతు సిరాజ్ పంటపొలాన్ని ఆయన పరిశీలించారు. ఏఏ మందులు వాడారు. ఎంత మోతాదులో ఎరువులు వేశారు. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమయంలో ఎలాంటి మందులు వాడాలనే విషయాలపై రైతుకు అవగాహన కల్పించారు. వాణిజ్య పంటలతో పాటు ఆహార పంటలు పండించాలని, సేంద్రియ పంటలు పండిస్తే మరింత మేలు ఉంటుందని పేర్కొన్నారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తిర్యాణి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు సార రమేశ్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ‘ఇంటింటికీ బీజేపీ – ప్రతీ గడపకు బూత్ అధ్యక్షుడు’ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీతారాం, గాయంగి తిరుపతి, రంగు అరుణ్ కుమార్, తొడసం భాస్కర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

‘సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు అస్వస్థత’

రెబ్బెన: రెబ్బెన సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ముగ్గురు విద్యార్థుల అస్వస్థతకు ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ ఆరోపించారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారన్నారు. ప్రిన్సిపాల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా విద్యార్థులకు మిషన్ భగీరథ నీటిని అందిస్తూ సిబ్బంది మాత్రం మినరల్ వాటర్ తాగుతున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు పురుషోత్తం, కమిటీ సభ్యుడు గజానంద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మహిళా సంఘాల స్టాళ్లు



కలెక్టరేట్‌లోని మహిళా సంఘాల స్టాళ్లు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వివిధ స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రజావాణి పురస్కరించుకుని అర్జిదారులకు అవసరమున్న ఇప్పపూల లడ్డూలు, తేనె, పచ్చళ్లతో పాటు బిర్యాణి విక్రయాలు జరిపారు. వీటిని కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు.

శిశువుకు ముర్రుపాలు తాగించాలి



లింగాపూర్: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న విజయలక్ష్మి



ఆసిఫాబాద్: అవగాహన కల్పిస్తున్న పెంటుబాయి

లింగాపూర్: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే అనారోగ్యం దరిచేరదని ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని మండలంలోని గుమ్నూర్(బి) అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు ఆరోగ్యానికి మేలు

పెంచికల్‌పేట్: తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని బొంబాయిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టాలన్నారు. అనుబంధ ఆహారాన్ని 7నెలల నుంచి అందించాలని సూచించారు. చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. హసీనా, కరుణ, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

ఆసిఫాబాద్: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, విజయ, ఇందిర, ఫహీం, రాజమ్మ పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు



రోడ్డు పనులు చేస్తున్న ఆదివాసీలు



కల్వర్టుకు మరమ్మతు చేస్తున్న ఆదివాసీలు

కెరమెరి: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఆదివాసీలు చేతులు కలిపి రోడ్డుకు మరమ్మతులు చేశారు. మండలంలోని జోడేఘాట్‌కు వెళ్లే దారిలో అనేక చోట్ల రోడ్డు కోతకు గురవడంతో పాటు కల్వర్టులు తెగిపోయాయి. దీంతో ఎవరి కోసం వేచి చూడకుండా కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో జోడేఘాట్, కొలాంగూడ, పట్నాపూర్ గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఏకమై సోమవారం గుంతలు పూడ్చారు. కల్వర్టులకు మరమ్మతులు చేశారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన గ్రామస్తులను పలువురు అభినందించారు.

సబ్‌సెంటర్ ప్రారంభించరూ..!



ప్రారంభానికి నోచుకోని బీబ్రా సబ్‌సెంటర్

దహెగాం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్‌సెంటర్‌లకు పక్కా భవనాలు మంజూరు చేశాయి. మూడేళ్ల క్రితం బీబ్రా గ్రామంలో మంజూరైన సబ్‌సెంటర్ పూర్తయ్యి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. రూ.20 లక్షలతో నిర్మించిన సబ్‌సెంటర్‌ను ఇంకా ఎప్పుడు ప్రారంభిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సబ్‌సెంటర్ ప్రారంభించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్



తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని వినయ్ గార్డెన్ భట్టుపల్లి చౌరస్తా, విజయబస్తీ, బాలాజీనగర్ ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేస్తూ సరైన అనుమతి పత్రాలు లేని 100కు పైగా వాహనాలను గుర్తించి కేసు నమోదు చేశారు. నిషేధిత వస్తువుల అక్రమ రవాణా అరికట్టడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామానుజం తెలిపారు. పట్టణ సీఐ ప్రేంకుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్సైలు సుధాకర్, సురేశ్, సాగర్, కల్యాణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.